క్లుప్తంగా

ఉమారుద్రుడికి విశేష పూజలు



పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని నాగావళి నదీ తీరాన వెంచేసిన ఉమారుద్ర కోటేశ్వర స్వామికి సోమవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో స్వామివారి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పూజలు, విశేష హారతులు ఇచ్చారు. మాఘమాసం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శృతి

జి.సిగడాం: గ్రామాల్లో శాంతిభద్రతలు లోపించకుండా ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందికి డీఎస్పీ వై.శృతి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ, పట్టణాల్లో అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా చూస్తున్నామన్నారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. స్థానిక ఎస్సై సామంతుల రామారావు, సిబ్బంది ఉన్నారు.

తాళ్లవలసలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

లావేరు: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లావేరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టరు మణిభూషణ్ అన్నారు. తాళ్లవలస గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టరు విధానంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతలకు మెరిట్ సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లిలోని ఎంసీఏ అకాడమీలో నిర్వహించిన కీబోర్డు, గిటార్, తబలా, డోలక్, ప్యాడ్స్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లను సినీ నటుడు షకలక శంకర్ సోమవారం ప్రదానం చేశారు. లిపి శ్రీవల్లి, గణేష్, మహేష్‌బాబు, పక్కి రుత్విక్, బి.కుమార్‌స్వామి, చరణ్‌తేజ, ఓంకార్ మోహిత్, అఖిల, కరాటేలో జానీ మాస్టర్ బహుమతులు అందుకున్నవారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఎంసీఏ అకాడమీ సభ్యులు దమ్ము రామారావు, తిరుమల, మైలపల్లి రామారావు, సాగర్, కోడల లక్ష్మణరావు, ఎంసీఏ వ్యవస్థాపక అధ్యక్షులు మణిపాత్రుని నాగేశ్వరావు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కుట్రలు సాగవు



మాట్లాడుతున్న నాయకులు

జి.సిగడాం: జనసేన, టీడీపీ నాయకుల కుట్రలు ఇకసాగవని ఎంపీపీ మీసాల సత్యవతి, మండలపరిషత్ ప్రత్యేకాహ్వానితుడు వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో సోమవారం మాట్లాడారు. జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించడంలో వారి కృషి చేస్తున్న కృషి అభినందనీయమైనదన్నారు. టీడీపీ, జనసేన నాయకులు వలంటీర్లపై లేనిపోని ఆరోపణలు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. కాగా పెంట, సీతంపేట సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరవుతారన్నారు.

అర్హులందరికీ సంక్షేమం చేరువ

- వలంటీర్లపై తప్పుడు ప్రచారం తగదు
- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- కుప్పిలిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: అర్హులందరికీ సంక్షేమ పథకాలను గ్రామ సచివాలయం యూనిట్‌గా అందజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కుప్పిలి గ్రామ సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించారు. ప్రజలు నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రేషన్‌కార్డు వారీగా లబ్ధిదారులకు వర్తించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బ్రోచర్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను ఇంటికే చేరుస్తుండగా.. దీన్ని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. ఒకటో తేదీనే తలుపుతట్టి వలంటీర్లు పింఛన్లు అందజేయడం.. సంక్షేమ పథకాలను చేరవేస్తుంటే వారిపై తప్పుడు ప్రచారం చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్యాకేజీ స్టార్, సీబీఎన్ దత్త పుత్రుడు పవన్‌కల్యాణ్ వలంటీర్లు మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని వ్యాఖ్యానించడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. స్వచ్ఛంద సేవ చేస్తున్న వారిని మానవ అక్రమ రవాణా నేరగాళ్లుగా అభివర్ణించటం ప్రజలను అవమానించడమేనన్నారు. ఇటువంటి వారికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, రాష్ట్ర మహిళా సహకార సంస్థ అధ్యక్షురాలు, ఎచ్చెర్ల జెడ్పీటీసీ సభ్యురాలు బల్లాడ హేమమాలినీరెడ్డి, మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దనరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, సర్పంచ్ బల్లాడ హేమమాలినీరెడ్డి, నాయకులు వెంకటఅప్పారావు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

దత్తపుత్రుడికి మతిభ్రమించింది

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: చంద్రబాబు దత్త పుత్రుడు పవన్‌కల్యాణ్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో సోమవారం మాట్లాడారు. ఐదు వేల రూపాయల గౌరవ వేతనం తీసుకుంటూ ఇంటింటికీ బంధువుగా.. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవన్నారు. కష్టపడి పనిచేసే వలంటీర్లపై పవన్ చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయన అన్న మాటలను భేషరుతుగా వెనక్కి తీసుకుని వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి ఒకటో తేదీనే పింఛన్ అందజేస్తున్నారన్నారు. రేషన్ ఇవ్వాలన్నా, ఇతర ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నా అన్నీ పారదర్శకంగా జరుగుతున్నాయని చెప్పారు. కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలు దేశవ్యాప్తంగా.. ఎన్నో రాష్ట్రాల ముఖ్యమంత్రుల ప్రశంసలు అందుకున్నాయని గుర్తు చేశారు



క్రిష్టాపురంలో నిరసన తెలియజేస్తున్న వలంటీర్లు

వలంటీర్ల నిరసన

రణస్థలం: జనసేన పార్టీ నాయకుడు పవన్ కల్యాణ్ తమపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ క్రిష్టాపురం వలంటీర్లు సోమవారం నిరసన తెలియజేశారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించేందుకు కృషి చేస్తున్న తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

రైతు సమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న వేణుగోపాలరావు

జి.సిగడాం: రైతులకు నెలకున్న భూ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి వాటిని పరిష్కారం చేసేదిశగా పని చేయాలని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు సిబ్బందికి సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టుతున్న భూ సర్వే రైతులకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ఇప్పటికే సర్వే చేసిన గ్రామాల్లో హద్దు రాళ్ల ఏర్పాటు చేశామన్నారు. కొన్ని గ్రామాల్లో కోర్టులో కేసులు ఉండడంతో కొన్ని సమస్యలు పరిష్కారం సాధ్యమం కావడం లేదన్నారు. సమస్య వచ్చిన వెంటనే సంబంధిత వీఆర్వో, ఆర్ఐల ద్వారా పూర్తి సమాచారం తెప్పించుకుని పరిశీలిస్తున్నామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసేందుకు ఎవ్వరూ ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టామన్నారు. ఒన్-బీ రాకపోతే తక్షణమే వీఆర్వో దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు నాయకుడుగారి నిర్మల, హనుమంతురావు, ఆర్ఐ రామచంద్రరావు ఉన్నారు.

మత్స్యకార కుటుంబాలకు పరామర్శ



మత్స్యకారులతో మాట్లాడుతున్న రామ్‌మనోహర్ నాయుడు

గార: బందరువానిపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు గుంటు గణపతి, పుక్కల్ల లక్ష్మయ్యలు సముద్రంలోకి బోటుపై చేపల వేటకు వెళ్లి ఆదివారం గల్లంతయ్యారు. వీరిలో ఒకరు మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు సోమవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు గనగళ్ల రామారావు, బుద్ధ ఎర్రన్న, మార్పు పృధ్వీ ఉన్నారు.

నియామక పత్రం అందజేత



నియామక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

రణస్థలం: జీరుపాలెం గ్రామానికి చెందిన రాయితి చిన్నారావు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఈయనకు నియామక పత్రాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ సోమవారం అందజేశారు. జెడ్పీటీసీ టొంపల సీతారాం, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో శ్రీనివాసనాయుడు, నాయకులు మైలపల్లి కామరాజు, మహంతి పెద రామినాయుడు, చినరామినాయుడు, మాగుపల్లి రాము, కంబపు రామిరెడ్డి, కిల్లారి సన్యాసినాయుడు ఉన్నారు.

ఆహ్లాదకరంగా ఆకాశం



ఆకాశం ఆహ్లాదకరంగా దర్శనమిచ్చింది. నల్లటి మేఘాల్లో నుంచి వివిధ రంగుల్లో కాంతులు వచ్చి చూపర్లను కట్టిపడేసింది. ఈ అద్భుత దృశ్యం కొత్తపెంట–పాగిరి గ్రామాల మధ్యలో సోమవారం సాయంత్రం ఆవిష్కృతమైంది.

–జి.సిగడాం

నేడు రాగోలు, గూడేంలో 'జగనన్న సురక్ష'

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు, గూడేం గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరవుతారన్నారు.

తోనంగి, అంపోలులో..

గార: తోనంగి, అంపోలు –3 (చల్లపేట) సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరగనుందని ఎంపీడీవో సంజీవ రమణయ్య తెలిపారు. కార్యక్రమంలో లబ్ధిదారులకు 11 రకాల ఉచిత సేవలకు సంబంధించి ధ్రువపత్రాలు పంపిణీ, లబ్ధిదారులు ఎవ్వరైనా అనర్హులుగా ఉంటే వారికి పథకం వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమానికి మంత్రి .ధర్మాన ప్రసాదరావు హాజరవుతారన్నారు.

స్పందన వినతులు పరిష్కరించాలి



వినతులను స్వీకరిస్తున్న సత్యనారాయణ

ఎచ్చెర్ల: స్పందన కార్యక్రమానికి వస్తున్న వినతులను పరిశీలించి వాటిని వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ సత్యన్నారాయణ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించి వినతులు స్వీకరించారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి ఆక్రమణలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ



చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: శారీరక దివ్యాంగులకు నిత్యం ఫిజియోథెరపీ చేయడం ద్వారా ఆరోగ్యం నయమవుతోందని ఫిజియోథెరపీ వైద్యురాలు గొర్లె సునీత అన్నారు. మండల కేంద్రం వద్దఉన్న ఐఈఆర్‌టీ కేంద్రంలో శారీరక దివ్యాంగులకు సోమవారం ఫిజియోథెరపీ చేశారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఐఈఆర్‌టీ టీచర్లు కె.అరుణకుమారి, ఎస్.రమణ ఉన్నారు.

ఏజీపీగా రాడ రాజు నియామకం

కొత్తూరు: కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా మండలంలోని నివగాం గ్రామానికి చెందిన సీనియర్ అడ్వకేట్ రాడ రాజును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు సోమవారం అందాయని రాడ రాజు తెలిపారు. ఈ పోస్టులో మూడేళ్లు కొనసాగవచ్చని ఉత్తర్వుల్లో ప్రభత్వం పేర్కొందన్నారు.

కంటి శస్త్రచికిత్సలకు 65 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రత్నంరాజు

పొందూరు: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో విశాఖపట్టణం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో సత్యసాయి మందిరంలో సోమవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 65 మందికి కేటరాక్ట్ శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. సత్యసాయి కన్వీనర్ దున్నా రాధాకృష్ణ పర్యవేక్షణలో శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యుడు ఎస్.రత్నంరాజు 137 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో శస్త్ర చికిత్సలు అవసరమైన 65 మందిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: అర్హులందరికీ లబ్ధి చేకూరాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. జె.ఆర్.పురం–1 గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు జవాబుదారీతనం ఉండాలన్నదే తమ ఉద్దేశమన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సత్వరమే 11 సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నెల రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించేందుకు షెడ్యూలు విడుదల చేశారని తెలిపారు. గ్రామ, మండల స్థాయి అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బి.హెచ్.దుర్గారావు, తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి, ఈవోపీఆర్‌డీ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయిపురెడ్డి భుజంగరావు, మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, మైలపల్లి కామరాజు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, గ్రామ నాయకులు పచ్చిగుళ్ల సాయిరాం, దన్నాన సీతారాం, టీకె బ్రహ్మాజీ, షేక్ సైదాల్ ఉన్నారు.

గ్రంథాలయాధికారికి ప్రశంసాపత్రం



శ్రీనివాసరావుకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల: ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న చంద్రశేఖర్

లావేరు: మండల కేంద్రం లావేరు శాఖాగ్రంథాలయాధికారిగా పనిచేస్తున్న మురపాక శ్రీనివాసరావుకు ప్రశంసాపత్రం లభించింది. గుంటూరు జిల్లాలోని నాగార్జున యూనివర్సిటీ, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్తంగా పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్‌పై సోమవారం గుంటూరులో వర్కుషాపు నిర్వహించగా.. శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. ఆయన చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ ఈదా ఫౌండేషన్ చైర్మన్ శ్యాముల్‌రెడ్డి ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు.

ధర్మవరం గ్రంథాలయాధికారికి..

ఎచ్చెర్ల: ధర్మవరం శాఖా గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర్‌కు కూడా నాగార్జున యూనివర్సిటీ, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

రూపావతి సిక్కోలుకు ఆదర్శం

- జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్

శ్రీకాకుళం న్యూకాలనీ: పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పడాల రూపావతి జిల్లాకు ఆదర్శంగా నిలిచిందని శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (ఎస్‌డీబీఏ) కొనియాడింది. ఈ మేరకు సంఘ జిల్లా చైర్మన్ నటుకుల మోహన్, అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి అజయ్‌కుమార్, తదితరులు సోమవారం ఒక ప్రటకన విడుదల చేశారు. ఉగాండా దేశంలో జరుగుతున్న ప్రపంచ పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో జి.సిగడాం మండల సంతవురిటి గ్రామానికి చెందిన రూపావతి సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ మూడు విభాగాల్లో సత్తచాటి సిల్వర్ మెడల్స్ సాధించి శభాష్ అనిపించిందని వారంతా సంతోషం వ్యక్తం చేశారు. సాధించాలనే సంకల్పం ముందు వైకల్యం చిన్నబోయిందని.. రూపావతికి అన్ని విధాలగా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకరిస్తుందన్నారు.

నేడు అసిరితల్లి ఆవేటి వారాలు



అరసవల్లి:

అరసవల్లి, కాజీపేట గ్రామ దేవత అసిరితల్లి అమ్మవారి ఆలయంలో మంగళవారం ఆవేటి వారాల సంబరాలు జరుగనున్నాయి. ఈమేరకు కాజీపేట, అరసవల్లి, ఆదిత్యనగర్ కాలనీ, కామేశ్వరి నగర్, కన్నయ్య కాలనీ, ముసలయ్య కాలనీ, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల ప్రజలంతా అమ్మవారికి చల్లదనం చేసేందుకు ముర్రాటలతో ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు అమ్మవారి సంబరం ప్రారంభమవుతుందని..భక్తులంతా హాజరై తల్లి ఆశీస్సులు పొందాలన్నారు. ఉత్సవం కోసం స్థానిక ఆలయంలో ఏర్పాట్లు చేశారు.

కల్వర్టు నిర్మాణం



పొన్నాంపేట వద్ద చేపడుతున్న కల్వర్టు పనులు

ఆమదాలవలస రూరల్: మండలంలో ఆమదాలవలస నుంచి పురుషోత్తపురం గ్రామానికి గల ఆర్అండ్‌బీ రహదారిలో పొన్నాంపేట వద్ద కల్వర్టు మరమ్మతులకు గురికావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను ఇటీవల సాక్షి దినపత్రిలో ప్రచురితం కావడంతో స్పందించిన యంత్రాంగం కల్వర్టు పనులను వేగవంతంగా చేపడుతున్నారు. శిథిలమైన కల్వర్టును తొలగించి దాని స్థానంలో కొత్త కల్వర్టును నిర్మిస్తున్నారు. కల్వర్టు పనులు జరుగుతున్నందున వాహన రాకపోకలను పురుషోత్తపురం నుంచి వచ్చేవాటిని రామచంద్రాపురం, చిట్టివలస, గాజులకొల్లివలస గ్రామాల మీదుగా ఆమదాలవలస చేరుకునేలా రహదారి మార్గాన్ని కల్పించారు. కల్వర్టు పనులు రెండు రోజులు పట్టే సమయం ఉన్నందున ప్రయాణికులు, వాహనదారులు వేరొక మార్గాన ప్రయాణాలు సాగించాలని కాంట్రాక్టర్ తెలియజేశారు. కల్వర్టు పనులు సకాలంలో పూర్తిచేసి రహదారి మార్గాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు.

కేజీబీవీ ఎస్ఓగా అంబిక

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ఎస్ఓగా మొదలవలస అంబిక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఇటీవల కేజీబీవీల్లో ఎస్ఓలు, టీచర్ల నియామక ప్రక్రియ చేపట్టింది. విధుల్లోకి చేరిన ఎస్ఓకు కేజీబీవీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com